
సర్కారు బడి... సరికొత్త ఒరవడి

- ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్య
- ఇప్పటికే చేరిన టీవీలు
- చదువుపై విద్యార్థులకు పెరుగుతున్న ఆసక్తి

పెద్దాపురం: వినే అంశాల కన్నా చూసి నేర్చుకుంటే మరింత గుర్తుంటుంది.. మనసులో చెరగని ముద్ర వేస్తుంది.. అందుకే ప్రభుత్వం బడుల్లో సరికొత్త విధానాలకు రూపకల్పన చేసింది.. విద్యా సామర్థ్యాల పెంపులో భాగంగా సాంకేతిక విద్యను ప్రవేశ పెట్టింది. ప్రస్తుతం సర్కారు బడుల్లో డిజిటల్ విద్యా బోధనకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అన్ని వసతులు కల్పించడంతో విద్యపై పిల్లలు మరింత ఆసక్తి కనబరుస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు విద్యార్థులకు కొండంత అండగా నిలుస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వం సర్కారు బడుల్లో రూ.1.30 లక్షల విలువైన ఇంటరేక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ఏర్పాటు చేసి విద్యార్థులకు దృశ్య శ్రవణం ద్వారా విద్యా బోధన చేస్తుంది. ఇందులో భాగంగా పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో 29 జెడ్పీ పాఠశాలలు ఉండగా 112 ఐఎఫ్‌పీ టీవీలను అందజేసింది. 21 ఎంపీయూపీ పాఠశాలలకు 20 స్మార్ట్ టీవీలను అందించి విద్యాబోధన సాగిస్తున్నారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్ల ద్వారా విద్యార్థులకు సాంకేతిక విద్య అందించడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్య అందించేందుకు సహాయ పడుతున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బాటలు వేస్తోంది.


రాజీవ్‌గాంధీ పాఠశాలలో నూతన విద్యా విధానంలో బోధన

మంచి ఉత్తీర్ణత సాధించొచ్చు


ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ విధానంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా విద్యా బోధన ఎలా చేయాలనే అంశంపైనా ఇప్పటికే శిక్షణ పూర్తి చేశాం. ఆయా పాఠశాలల పరిధిలో తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. టీవీలు చూసి చదవడం వల్ల ఎక్కువ శాతం విద్యార్థులకు పాఠాలు గుర్తుంటాయి. అప్పుడే పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించవచ్చు.
–ఇ.ప్రభాకరశర్మ, ఎంఈఓ, పెద్దాపురం

ఆసక్తి పెరుగుతోంది


ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ టీవీలతో విద్యా బోధన చేయడం వల్ల సులభంగా అర్థమవుతోంది. సాంకేతిక విద్యతో పాటు ప్యానల్‌లో ఉన్న ఎన్నో రకాల విశేషాలు చూస్తున్నాం. అవి అర్థం చేసుకుంటున్నాం. దీనివల్ల ఎక్కువ కాలం గుర్తుంటున్నాయి. చదువుపై మా అంతట మాకే ఆసక్తి పెరిగింది.
–చంద్రిక, జీఎస్ మున్సిపల్ హైస్కూల్, పదో తరగతి

ఎంతో విజ్ఞానం


ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ టీవీల వల్ల పాఠాలను విద్యార్థులు త్వరగా అర్థం చేసుకుంటున్నారు. విద్యా బోధన సులభతరమైంది. ఎన్నో విషయాలు తెలుసుకుంటున్నారు. ఈ విద్య విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు పూర్తిగా సద్వినియోగం చేసుకుంటున్నారు.
–ఎంఎస్‌సీ మూర్తి, హైస్కూల్ హెచ్‌ఎం, కాండ్రకోట

క్లుప్తంగా

ఎంపీడీఓగా వెంకటనారాయణ


కొత్తపల్లి: మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)గా పి.వెంకటనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ జిల్లా నక్కపల్లి మండల విస్తరణాధికారిగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ పని చేసిన ఎంపీడీఓ అబ్రహం లింకన్ పదోన్నతిపై కాకినాడ డ్వామా డీఎల్‌డీఓగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీఓ నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పలువురు అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలి


విద్యార్థులకు క్రీడా పరికరాలను అందజేసిన సర్పంచ్ జయబాబు

కొత్తపల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి పెట్టాలని అమరవల్లి గ్రామ సర్పంచ్ పులి జయబాబు సూచించారు. అమరవల్లి ఎంపీపీ పాఠశాలకు ప్రభుత్వం అందించిన క్రీడా పరికరాలను సోమవారం ఆయన విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందన్నారు. నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విష్ణురెడ్డి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఏఓ సత్యనారాయణ

సామర్లకోట: స్కూల్ గేమ్స్‌లో భాగంగా కాకినాడ ఐడియల్ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో తమ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ చాటారని స్థానిక ప్రగతి కళాశాల చైర్మన్ ఎస్.పూర్ణచంద్రరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అండర్–19 విభాగం నుంచి సింగంపల్లి శ్రీనివాసు, పి.అనిల్‌కుమార్, ఎ.దిల్లేశ్వరరావు, ఇ.నరేంద్రలు ఎంపిక అయ్యారని తెలిపారు. వీరు అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ఏఓ సీహెచ్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించారు.

స్వచ్ఛతా హి సేవా ర్యాలీ


సామర్లకోటలో స్వచ్ఛతా హి సేవా ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సామర్లకోట: జిల్లా విద్యా శాఖ సూచనల మేరకు సోమవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వచ్ఛతా హి సేవా ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన పెంచడానికి ఈ కార్యక్రమం చేపట్టామని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. ఈ నెల 15 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం, కె.అరుణ, ఏఎల్‌వీ కుమారి, వీహెచ్ భద్ర, బాలశైలజ, లక్ష్మీదుర్గ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో గొల్లప్రోలు విద్యార్థి ప్రతిభ


ప్రతిభ చూపిన వీరమణికంఠను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పిఠాపురం: ఇండియన్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైజింగ్ స్టార్ ప్రీమియర్ లీగ్ అండర్–17 క్రికెట్ టోర్నీలో గొల్లప్రోలు బాలుర ప్రభుత్వ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి పిల్లి వీరమణికంఠ విశేష ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల హెచ్‌ఎం ఎ.రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో వీరమణికంఠను అభినందించారు. ఉపాధ్యాయులు రమాదేవి, ఎన్ గణేష్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్‌భవ కార్డుల పంపిణీ


గోర్సలో పేదలకు ఆయుష్మాన్‌భవ కార్డులు అందజేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని గోర్సలో ప్రజలకు సోమవారం ఆయుష్మాన్ భవ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు సర్పంచ్ రొంగల వీరబాబు హెల్త్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో ఆయుష్మాన్‌భవ కార్డులు చేయించుకోవాలన్నారు. ఈ కార్డులు ఉంటే అనారోగ్యంతో బాధపడుతున్న పేదలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం

కొత్తపల్లి: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని మండలంలో కొండెవరం సిద్ధి వినాయక ఆలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గ్రామపెద్దల సహకారంతో కంద బ్రదర్స్ ఆధ్వర్యంలో పలు రకాల వంటలతో అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన సుమారు 3 వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

ఈర్ష్యా ద్వేషాలకు దూరంగా ఉండాలి


భవనం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేస్తున్న సంతోష్ దీదీ

సామర్లకోట: ప్రతి వ్యక్తి ఈర్ష్యా ద్వేషాలకు దూరంగా ఉన్నప్పుడే ఉన్నత స్థితికి చేరుకుంటారని బ్రహ్మకుమారీస్ జాతీయ జాయింట్ చీఫ్ రాజయోగిని సంతోష్ దీదీ అన్నారు. స్థానిక అంబటివారి తోటలో సుమారు రూ. కోటితో నిర్మించిన ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయాన్ని (ఆనంద్ భవన్) ఆమె సోమవారం ప్రారంభించారు. సంతోష్ దీదీ భవనాన్ని ప్రారంభించి బ్రహ్మకుమారీస్ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణతో కలసి కేక్ కట్ చేశారు. హిందీలో ఆమె ప్రసంగించగా నాలుగు జిల్లాల ఇన్‌చార్జి రజనీ దీదీ తెలుగులో అనువాదం చేశారు. సంతోష్ దీదీ ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ ప్రతి ఒక్కరూ ఉన్నదానిలో సంతోషంగా ఉంటే శాంతిని పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇతరులపై ఆధారపడి జీవించే వారికి సుఖం, సంతోషం ఉండదన్నారు. ఇతరులతో పోల్చుకోకుండా ఎవరికి వారేగా జీవించాలన్నారు. వీటిని జయించడానికి భగవంతుని పట్ల నమ్మకంతో ఉండాలన్నారు. ఆనందం అనేది ప్రజల చేతిలోనే ఉంటుందని చెప్పారు. ఆధ్యాత్మికతను పెంచడానికి రాజస్తాన్ నుంచి 140 దేశాల్లో బ్రహ్మకుమారీస్ సేవలందిస్తున్నట్లు చెప్పారు. ధర్మాన్ని మనం కాపాడితే, ఆ ధర్మమే మనల్ని కాపాడుతుందని బోధించారు. ఆనందం అనేది ఆత్మకు సంబంధించిందని ఆమె అన్నారు. ప్రతి ఒక్కరూ ధర్మక్షేత్రం విశిష్టతను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ రాజయోగినిలు, వివిధ జిల్లాల ప్రతినిధులు రజనీ దీదీ, అన్నపూర్ణ దీదీ, శివలీల బెహన్, సత్యవతి బెహన్, లక్ష్మి, అపర్ణ, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, పారిశ్రామిక వేత్తలు వెంకటేశ్వరరావు, బిక్కిన సాయి, ఈదల బాబూరావు, సింగవరపు సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల అలంకరణలో వినాయకుడు


తాటిపర్తిలో కూరగాయల అలంకరణలో దర్శనమిస్తున్న వినాయకుడు


రమణక్కపేటలో గణపతిని ఎడ్ల బండిపై ఊరేగిస్తున్న భక్తులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడు సోమవారం కూరగాయల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సుమారు 60 కేజీల వివిధ రకాల కూరగాయలతో స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గణపతికి ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా గణపతి నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం కొత్తపల్లి, వాకతిప్ప, ఉప్పాడ, కొమరగిరి, మూలపేట, కుతుకుడుమిల్లి గ్రామాల్లోని గణపతి మందిరాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కొమరగిరి శివారు ఆనంద్ నగర్‌లో చిన్నారులు మట్టి గణపతిని ప్రతిష్ఠించి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. రమణక్కపేటలో గణపతిని సంప్రదాయ ఎడ్లబండిపై ఊరేగించి నిమజ్జనం చేశారు.

గణేశ మండపాల్లో అన్నసమారాధనలు

సామర్లకోట: గణపతి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మండపాల వద్ద సోమవారం అన్న సమారాధనలు జరిగాయి. స్థానిక 15వ వార్డు మట్టపల్లివారి వీధిలో అన్నదాన కార్యక్రమాన్ని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ప్రారంభించారు. వార్డు కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు దన్ని రాజస్త్రస్ అంకపూర్ణ చంద్రశేఖర్, దన్నిన దుర్గ, బి.రమేష్, ఆదిత్య కృష్ణ, దన్నిన శ్రీహరి భక్తులకు సేవలందించారు. బసివిరెడ్డి సత్రం వద్ద శ్రీలక్ష్మీ గణపతి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన అన్నదాన కార్యక్రమాన్ని దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు ప్రారంభించారు. స్థానిక పెద్దాపురం ఆటో స్టాండ్ యూనియన్ అధ్యక్షుడు డి.సోమేశ్వరరావు, సంఘ నాయకులు సంగినీడి బుజ్జి, ఎస్.శ్రీనివాసు, వి.వెంకటరమణ, వేట్లపాలెం భజన మండలి కమిటీ సభ్యులు సేవలందించారు. సుమారు 8 వేల మందికి అన్నదానం చేసినట్లు సంఘ అధ్యక్షుడు సోమేశ్వరరావు తెలిపారు.


సామర్లకోట 15వ వార్డులో అన్న ప్రసాదాన్ని స్వీకరించిన దవులూరి దొరబాబు


సామర్లకోట ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంలో సుబ్బారావు

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు

పెద్దాపురం: విద్యా రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిచ్చి పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపట్టిందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని ఆర్‌బీకొత్తూరు ఎంపీయూపీ పాఠశాలను జిల్లా పరిషత్ హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసిన నేపథ్యంలో సోమవారం హైస్కూల్ తరగతి గదులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ గోలి రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. నాడు–నేడు పథకం కింద అన్ని పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేస్తుందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని దొరబాబు కోరారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, ఏఎంసీ చైర్మన్ వల్లూరి జ్యోతి, గుడివాడ సర్పంచ్ కనపర్తి చీమదొర, యంద్రు సత్తిబాబు, పల్లా శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌బీ కొత్తూరులో హైస్కూల్ తరగతి గదిని విద్యార్థులతో కలసి ప్రారంభిస్తున్న దొరబాబు

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోండి

- జెడ్పీటీసీ నాగలోవరాజు
- గొల్లప్రోలులో మండల సమావేశం

పిఠాపురం: ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా విజృంభిస్తున్న సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని గొల్లప్రోలు జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు అధికారులకు సూచించారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే, సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలపై వైద్యారోగ్య శాఖాధికారులను ప్రశ్నించారు. దీనిపై గొల్లప్రోలు మండల వైద్యాధికారి శ్యామల మాట్లాడుతూ అన్ని గ్రామాల్లోనూ వైద్య సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారన్నారు. డెంగీ కిట్లు అన్ని పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉంచామని, ల్యాబ్ టెక్నీషియన్లు సైతం అందుబాటులో ఉన్నారని తెలిపారు. వ్యాధుల నివారణపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక ఆహ్వానితుడు అరిగెల రామయ్యదొర మాట్లాడుతూ మండలంలోని చినజగ్గంపేట అంగన్‌వాడీ టీచర్ రాజీనామా చేశారని, కొత్త టీచర్ నియమకానికి చర్యలు తీసుకోవడం కోసం తాను ఫోన్ చేస్తే ఎందుకు స్పందించలేదని ఐసీడీఎస్ సీడీపీఓ దుర్గాదేవిని నిలదీశారు. దీనిపై ఆమె సమాధానం ఇస్తుండగా ఇద్దరి మధ్య కొద్ది సేపు వాగ్వాదం జరిగింది. ఎంపీడీఓ శర్మ కలగజేసుకుని నిబంధనల ప్రకారం వివరాలు అందజేయాలని సీడీపీఓకు సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిల్ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా చేపట్టిన పనులు, ఇతర వివరాలను సభ్యులకు వివరించారు. ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ మాట్లాడుతు గ్రామాల్లో రోడ్లు, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డీఎల్‌ఎస్ శర్మ, వైస్ ఎంపీపీలు బత్తిన మంగ, నేమాని ఆదివిష్ణు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ

'స్పందన' బాగుంది

సామర్లకోట: జగనన్నకు చెబుదాం 'స్పందన' కార్యక్రమంలో సమస్యలకు పరిష్కారం లభించడంతో లబ్ధిదారుల మోములో ఆనందం వెల్లివిరుస్తోంది. నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకంలో తనకు ఇళ్ల స్థలం కేటాయించాలంటూ సామర్లకోటకు చెందిన తూరపాటి దుర్గాదేవి ఇటీవల కలెక్టర్ కృతికా శుక్లాకు అర్జీ సమర్పించారు. అర్జీని పరిశీలించిన కలెక్టర్ స్థానిక ఈటీసీ లేఅవుట్‌లో స్థలం కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పట్టాను సోమవారం స్థానిక రైతు భవనంలో జరిగిన జగనన్నకు చెబుదాం 'స్పందన' కార్యక్రమంలో దుర్గాదేవికి కలెక్టర్ అందజేశారు. దీంతో ఆమె కంట తడిపెట్టుకొని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపింది. ఆ స్థలంలో ఇంటి నిర్మాణ పనులు జరిగే విధంగా చూడాలని మెప్మా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.


కలెక్టర్ కృతికా శుక్లా నుంచి ఇంటి పట్టా అందుకుంటున్న దుర్గాదేవి

గుర్తు తెలియని వ్యక్తి మృతి


సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురం ఓవర్ బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆ ప్రాంత ప్రజలు గుర్తించారు. ఈ మేరకు వీఆర్వో భరత్ సమాచారంతో పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి వయసు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, ఒంటిపై నీలం రంగు టీషర్టు, బ్రౌన్ కలర్ ప్యాంటు ఉందని పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి సీఐ దుర్గాప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలకు 94407 96568, 96662 02493 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు సత్కారం

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన లావణ్యకుమారికి ఆసుపత్రి సిబ్బంది ఘన స్వాగతం పలికారు. సోమవారం ఆసుపత్రిలోని ఎస్ఆర్‌ఎంటీ భవనం నుంచి ఆమెను వందలాది సిబ్బంది అనుసరిస్తూ వెల్కం మేడం అంటూ ఆహ్వానించారు. తొలుత సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమెను సత్కరించారు. తర్వాత పూర్వపు సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవిని సత్కరించి ఘన వీడ్కోలు పలికారు. విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ వీవీ బుద్ధా మాట్లాడుతూ డాక్టర్ లావణ్యకుమారి నిబద్ధతకు తగిన గౌరవం దక్కిందన్నారు. డాక్టర్ లావణ్య, డాక్టర్ హేమలతా దేవిలను అనస్తీషియా హెచ్‌ఓడీ డాక్టర్ విష్ణువర్ధన్ బృందం సత్కరించింది.

జనసేనలో చేరిన టీడీపీ నేతలు

పిఠాపురం: నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు మండలాలకు చెందిన టీడీపీ నేతలు సోమవారం టీడీపీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరారు. మాజీ ఎంపీపీ, టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు బవిరిశెట్టి రాంబాబు, మాదేపల్లి శ్రీనివాసరావు, దొడ్డి నాగలతో పాటు మరో 26 మంది టీడీపీ సభ్యత్వాలకు రాజీనామా చేసి హైదరాబాద్‌లో జనసేన రాష్ట్ర కార్యదర్శి నాగబాబు, పిఠాపురం ఇన్‌చార్జ్ ఉదయ శ్రీనివాస్ సమక్షంలో జనసేనలో చేరారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ నిరంకుశ దోరణికి నిరసనగా తాము టీడీపీకి రాజీనామా చేసినట్లు జనసేనలో చేరిన నేతలు తెలిపారు.

పంచాయతీ చట్టాలపై అవగాహన అవసరం

సామర్లకోట: పంచాయతీ చట్టాలపై కార్యదర్శులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని విస్తరణ శిక్షణ కేంద్రం సీనియర్ ఫ్యాకల్టీ, కోర్స్ డైరెక్టర్ శ్రీదేవి అన్నారు. స్థానిక శిక్షణ కేంద్రంలో సోమవారం కాకినాడ జిల్లా పరిధిలోని పంచాయతీ కార్యదర్శుల శిక్షణను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు తమ విధులను వికేంద్రీకరణ చేయడం ద్వారా పనులు వేగంగా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ మేరకు గ్రామాల్లోని సచివాలయ సిబ్బంది, వలంటీర్లను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీల పరిధిలో కొత్త లేఅవుట్ల ఏర్పాటు, పరిపాలన విధానం, హక్కులు, బాధ్యతలు, పంచాయతీ చట్టం, ఉపాధి హామీ పనులు, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, క్షేత్ర స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, ప్రభుత్వ జీఓలు, ఉద్యోగుల విధి నిర్వహణకు సంబంధించి క్రమశిక్షణ చర్యలు తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్, ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, నిహారిక, బి.ఆంజనేయులు పాల్గొన్నారు.


పంచాయతీ కార్యదర్శుల శిక్షణలో మాట్లాడుతున్న కోర్స్ డైరెక్టర్ శ్రీదేవి

విద్యారంగ పరిరక్షణలో కీలకపాత్ర

పెద్దాపురం: విద్యారంగ పరిరక్షణలో యూటీఎఫ్ కీలకపాత్ర పోషించిందని యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు ప్రభాకరవర్మ అన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ప్రచారజాత సోమవారం పెద్దాపురం పట్టణానికి చేరుకుంది. పట్టణ, మండల కమిటీ ఆధ్వర్యంలో జాతాకు స్వాగతం పలుకగా మరిడమ్మ గుడి వద్ద జెండాను ప్రభాకరవర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే అతిపెద్ద ఉపాధ్యాయ సంఘంగా యూటీఎఫ్ నిలిచిందన్నారు. స్వర్ణోత్సవాల సూచకంగా అక్టోబర్ 1న విజయవాడలో ప్రారంభ సభ ఉంటుందన్నారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ నాయకత్వం వహించిన కార్యక్రమంలో నగేష్, చక్రవర్తి, ఎంఎసీ మూర్తి, సీతారామారావు, బి.అనంతరావు, శివశంకర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని ఆ సంఘ ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ పిలుపునిచ్చారు. స్వర్ణోత్సవ ప్రచారజాత పెద్దబ్రహ్మదేవం నుంచి 200 బైక్‌లతో స్థానిక సీఐటీయూ కార్యాలయం వరకూ సాగింది. మెహర్ కాంప్లెక్స్‌లో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు జోగా అప్పారావు జెండాను ఆవిష్కరించారు. ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పనిచేసే సంఘంగా యూటీఎఫ్ గుర్తింపు పొందిందన్నారు. రాష్ట్ర కార్యదర్శులు రాము, అన్నారామ్, ప్రభాకర్ వర్మ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, రవి, చక్రవర్తి, పట్టణ ప్రధాన కార్యదర్శి రాజా కోశాధికారి శ్రీనివాసు పాల్గొన్నారు.


పెద్దాపురంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ జాతా వద్ద ఉపాధ్యాయులు

3 నుంచి బ్యాలెట్ యూనిట్ల తనిఖీ

కాకినాడ సిటీ: కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో అక్టోబర్ మూడో తేదీ నుంచి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు మొదటి స్థాయి తనిఖీకి ఏర్పాట్లు ముమ్మరం చేయాలని ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. సోమవారం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ శాఖతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటింగ్ యంత్రాల మొదటి స్థాయి తనిఖీ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో 3వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి సిబ్బంది నియామకం, భద్రతా ఏర్పాట్లు, సాంకేతిక శిక్షణ ఇంటర్నెట్ ఏర్పాట్లు త్వరితగతిన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, అర్బన్ తహసీల్దార్ సీతాపతిరావు, రూరల్ తహసీల్దార్ మురార్జీ, ఏవో వరహాలయ్య, వన్ టౌన్ ఎస్ఐ శోభన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.